ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై తేల్చండి

› మొదటిపేజీ తరువాయి...
గతంలో సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును రద్దుచేసింది.
ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యాక కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ ఫిరాయింపు చట్టాన్ని ఉల్లంఘించారని, వారిపై అనర్హత వేటు వేయాలన్న తమ పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని తెలుపుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద హైకోర్టును ఆశ్రయించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ జరిపి గత నెల 9న తీర్పు వెలువరించింది. స్పీకర్‌కు నేరుగా ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంటూ.. అనర్హత పిటిషన్లపై షెడ్యూలు ఖరారు చేయడానికి ఫైళ్లను స్పీకర్ ముందుంచాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. ఆ తర్వాత నాలుగు వారాల్లో షెడ్యూలు నిర్ణయించాలని, లేదంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలనే పిటిషన్లపై తామే తేల్చాల్సి ఉంటుందని తీర్పు వెలువరించింది. ఈ తీర్పును రద్దు చేయాలంటూ శాసనసభ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు వేర్వేరుగా రెండు అప్పీళ్లను దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సమగ్ర విచారణ జరిపింది. శుక్రవారం 78 పేజీల తీర్పును వెలువరించింది.

స్పీకర్ తేల్చాల్సిందే

'పార్టీ ఫిరాయింపుల వ్యవహారాలపై సుప్రీంకోర్టులో దాఖలైన పలు కేసుల్లో వెలువడిన తీర్పులన్నింటినీ పరిశీలిస్తే.. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు కింద అనర్హత పిటిషన్లపై తేల్చే అధికారం స్పీకర్‌కు ఉన్నది. సహేతుక సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి' అని తీర్పులో పేర్కొన్నారు. అదే సమయంలో స్పీకర్ నిర్ణయం కిహటో హోలోహన్, రాజేంద్రసింగ్ రాణా, సుభాష్ దేశాయ్ కేసుల ప్రకారం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందన్నారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా స్పీకర్ ఉంటారని, ఒక కోర్టు విధుల్లోకి మరో కోర్టు జోక్యం చేసుకోరాదని గతంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు కేసులో ఇదే హైకోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని ఉదహరించింది. అయితే, ఈ తీర్పు సుభాష్ దేశాయ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు ముందుగా వచ్చినందున దానిని పరిగణనలోకి తీసుకోలేమని తెలిపింది. అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట సమయంలో తేల్చాల్సి ఉన్నదని, ఆ సమయం ఎంత అన్నది ఆ కేసులోని అంశాలు, పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. 'ప్రస్తుత కేసులో అనర్హత పిటిషన్లపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న సమయం, అసెంబ్లీ కాలపరిమితి వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని సహేతుక సమయంలో స్పీకర్ తేల్చాలి' అని తీర్పులో స్పష్టం చేసింది.

స్పీకర్ నిర్ణయంలో కోర్టుల జోక్యాన్ని నిషేధించలేదు

అనర్హత పిటిషన్ల విచారణ జరిగినప్పుడు చట్టసభ సభ్యులను సస్పెండ్ చేస్తూ స్పీకర్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే సమయంలో ఏమైనా తీవ్ర పరిణామాలు ఎదురైతేనే కోర్టుల జోక్యానికి వీలుంటుందని ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ఆయా కేసుల్లో ఉదహరించిన రాజ్యాంగ అధికరణలను ప్రస్తావించింది. అధికరణాలు 136, 226, 227 కింద సుప్రీంకోర్టు, హైకోర్టుల జోక్యాన్ని పూర్తిగా నిషేధించలేదని కూడా చెప్పింది. రాజ్యాంగ ఉల్లంఘనలు, దురుద్దేశాలు, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నప్పుడు కోర్టులు జోక్యం చేసుకోవచ్చని హైకోర్టు తేల్చిచెప్పింది. రాజేంద్రసింగ్ రాణా కేసును ఉదహరించింది. పార్టీ చీలిక, విలీనం తేలేదాకా అనర్హత పిటిషన్లపై నిర్ణయాన్ని స్పీకర్ వాయిదా వేయడంపై సుప్రీంకోర్టు కిహిటో హోలోహన్ కేసు ఆధారంగా జోక్యం చేసుకుని స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేసిందని ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఆ కేసులో అధికరణ 226 కింద న్యాయ సమీక్ష చేయవచ్చా? లేదా? అని తేల్చలేదని చెప్పింది. అనర్హత పిటిషన్లపై సకాలంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయవచ్చని పేర్కొన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేశం మెగాచంద్రసింగ్ వర్సెస్ మణిపూర్ స్పీకర్ కేసులో నాలుగు వారాల్లో అనర్హత పిటిషన్లపై తేల్చాలని తీర్పు చెప్పిందని గుర్తు చేసింది. ఎస్ఏ సంపత్‌కుమార్ వర్సెస్ కాలె యాదయ్య కేసు ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నదని హైకోర్టు తెలిపింది. సుభాష్ దేశాయ్ కేసులో సుప్రీం తీర్పుకు కట్టుబడి ఈ తీర్పు వెలువరిస్తున్నట్టు స్పష్టం చేసింది.

మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం చెప్పింది

బీఆర్ఎస్ న్యాయవాదుల వాదన

గండ్ర మోహన్‌రావు

'ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్ మరో దుష్ట సంప్రదాయానికి తెరతీసి బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఒక్కరోజు కూడా అసెంబ్లీలో ఉండేందుకు వీల్లేదు. స్పీకర్ కాలయాపన చేస్తుంటే హైకోర్టు/సుప్రీంకోర్టు చూస్తూ ఉండకూడదు. అధికార పార్టీ తరపున స్పీకర్ పదవిని చేపట్టిన వ్యక్తి అధికారపార్టీలో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్ల విచారణకు ఆసక్తి చూపకపోతే కోర్టులు జోక్యం చేసుకోవాల్సిందే. ప్రజా తీర్పును కాలరాసే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పిటిషన్లను స్పీకర్ మూడు నెలల్లోగా పరిష్కరించాలి. లేనిపక్షంలో కోర్టులకు జోక్యం చేసుకునే అధికారం ఉంది. ఐదేండ్లపాటు నిర్ణయం తీసుకోకుండా ఉంటే ఎమ్మెల్యేల పదవీకాలం పూర్తి అయిపోతుంది. కేశం మెగాచంద్రసింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్ మధ్య జరిగిన కేసులో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణీత గడువులోపు నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. అంటే మూడు నెలలని కూడా చెప్పింది. రాజ్యాంగంలోని 142వ అధికరణం మేరకు కోర్టులు ఉత్తర్వులు జారీచేయాలి. ఈ ఆదేశాలు స్పీకర్‌కు ఇవ్వరని, 10వ షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మన్‌గా స్పీకర్ వ్యవహరిస్తారు కాబట్టి చైర్మన్‌కు ఆదేశాలు ఇవ్వాలి' అని బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచందర్‌రావు వాదించారు.

నిర్దిష్ట కాలమంటే.. 3 నెలలే!

- ఫిరాయింపుదారుల అనర్హత వేటుపై వ్యవధిలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి
- మహారాష్ట్ర ఎన్సీపీ, శివసేన కేసులలో గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత వేటుపై నిర్దిష్ట సమయంలో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు అసెంబ్లీ స్పీకర్‌కు సూచించింది. ఈ క్రమంలో హైకోర్టు సూచించినట్టు ఆ కాలవ్యవధి ఏ మేరకు ఉండవచ్చన్న చర్చ పెద్దఎత్తున జరుగుతున్నది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో శివసేన (ఠాక్రే-షిండే), ఎన్సీపీ (శరద్ పవార్-అజిత్ పవార్) కేసులో గతంలో సుప్రీంకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలను న్యాయకోవిదులు ఉటంకిస్తున్నారు.

మూడు నెలలే వ్యవధి

ఓ పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్లు మూడు నెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. స్పీకర్ అలా చేయని పక్షంలో ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలంటూ కోర్టును ఆశ్రయించే అవకాశం ఫిర్యాదుదారులకు ఉంటుందని గుర్తుచేసింది. ఈ మేరకు మహారాష్ట్రలో శివసేన (ఠాక్రే-షిండే), ఎన్సీపీ (శరద్ పవార్-అజిత్ పవార్) కేసులకు సంబంధించి ఈ ఏడాది మొదట్లో జరిగిన విచారణలో, 2020లో మణిపూర్‌కు చెందిన ఓ మంత్రి కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

స్పీకర్ అధికారాలకు పరిమితులు

రాజ్యాంగం పదో షెడ్యూల్‌లోని 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుంది. స్పీకర్ పరిమిత సమయంలో నిర్ణయం తీసుకోవాలనే నిబంధన గతంలో లేదు. దీంతో రాజకీయ ప్రయోజనాలను అనుసరించి అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగేది. ఈ ధోరణిపై

దృష్టి సారించిన సుప్రీంకోర్టు ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అనర్హత పిటిషన్లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్లకు డెడ్‌లైన్లు విధిస్తున్నది. మహారాష్ట్రలోని ఎన్సీపీని చీల్చి శివసేన (షిండే)-బీజేపీ ప్రభుత్వంలో చేరిన అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేలపై ఎన్సీపీ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆ రాష్ట్ర స్పీకర్‌ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. శివసేన (షిండే) ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లకు కూడా ఇదే తరహా డెడ్‌లైన్ విధించింది. ధర్మాసనం ఆదేశాలు పాటించకపోతే, కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్న భావనతో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

స్పీకర్ నిర్ణయంపై కోర్టులో సవాల్

1993లో కిహటో హోల్లో హన్ వర్సెస్ జాచిల్హూ కేసులో సుప్రీం ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం సభ్యుల అనర్హతలను ప్రకటించడంలో స్పీకర్‌ది తుది నిర్ణయం అయినప్పటికీ, దీనిపై న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుందని కోర్టు పేర్కొన్నది. స్పీకర్ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేయడం రాజ్యాంగబద్ధమేనని చెప్పింది.

రాజకీయ భవిష్యత్తూ అంధకారమే!

ఫిరాయింపులకు పాల్పడే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు పడటమే కాకుండా వారి రాజకీయ భవిష్యత్తు కూడా అగమ్యగోచరమయ్యే పరిస్థితి ఉంటుందని మణిపూర్ మంత్రికి సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును బట్టి అర్థమవుతున్నది. మణిపూర్‌కు చెందిన ప్రస్తుత బీజేపీ నేత తౌనోజామ్ శ్యామ్ కుమార్ సింగ్ 2017లో కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి బీజేపీలోకి చేరడంతో మంత్రి పదవి దక్కింది. శ్యామ్‌పై అనర్హత వేటు వేయాలని 2017లో కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. మూడేండ్లపాటు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ కాలయాపన చేశారు. ఈ కేసును 2020లో విచారించిన సుప్రీంకోర్టు శ్యామ్‌కుమార్‌ను మంత్రి పదవి నుంచి తొలగించడమే కాకుండా.. తాము ఉత్తర్వులు ఇచ్చే వరకు శ్యామ్ శాసనసభలో అడుగుపెట్టకూడదని ఆదేశించింది. అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఈ సందర్భంగా కోర్టు ఆదేశించింది.

ఏమిటీ ఫిరాయింపులు?

ఒక రాజకీయ పార్టీ టికెట్‌పై చట్టసభలకు ఎన్నికైన సభ్యులు స్వార్థప్రయోజనాలతో మరో పార్టీలోకి మారడాన్నే 'పార్టీ ఫిరాయింపు'గా వ్యవహరిస్తారు. ఈ చర్యలను నియంత్రించడానికే 1985లో కేంద్రంలోని అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం.. 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని' తీసుకొచ్చింది. 52వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పదో షెడ్యూల్‌ను చేర్చింది. ఆర్టికల్స్ 101, 102, 190, 191ల్లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి వివరించారు.

అనర్హత వేటుపై నిర్ణయాధికారం ఎవరిదంటే?

ఫిరాయింపునకు పాల్పడిన సభ్యుడిపై అనర్హత వేటు వేసే నిర్ణయాధికారం పూర్తిగా సభాధ్యక్షుడికే ఉంటుంది. పార్టీ ఫిరాయింపుతోపాటు, పార్టీలో చీలిక, పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటేయడం వంటి అంశాలు వివాదాస్పదమైనప్పుడూ నిర్ణయం తీసుకొనే అధికారం కూడా సభాధ్యక్షుడికే ఉంటుంది.

న్యాయస్థానాల పరిధి ఏమేరకు??

సహేతుక కారణాలు, ఎలాంటి ఆధారాలు లేకుండా సభాధ్యక్షుడు రాజకీయ పార్టీ విలీనానికి సమ్మతించినప్పుడు ఆ ప్రక్రియను న్యాయస్థానంలో సవాల్ చేయవచ్చు. చట్టానికి లోబడి సభ్యులపై చర్యలు తీసుకోవడంలో సభాధ్యక్షుడు విఫలమైనప్పుడు కోర్టును ఆశ్రయించవచ్చు. రాజకీయ పార్టీలు చేసే ఫిర్యాదులపై సభాధ్యక్షులు నిర్ణయం తీసుకోవడంలో ఉద్దేశపూర్వక జాప్యం చేసినప్పుడు న్యాయస్థానాలకు వెళ్లొచ్చు.

స్పీకర్ జాప్యం చేస్తే.. సుప్రీంకు బీఆర్ఎస్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో అసెంబ్లీ స్పీకర్ జాప్యం చేస్తే.. సుప్రీంకోర్టును వెళ్లాలనే యోచనలో బీఆర్ఎస్ పార్టీ ఉన్నట్టు తెలుస్తున్నది. అనర్హత పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ శుక్రవారం ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం సుప్రీంకోర్టుకు వెళ్లనున్నది.

సంక్షోభాన్ని ఇరు దేశాలు అధిగమిస్తాయి: అమెరికా

అదానీపై నమోదైన కేసులో వైట్‌హౌస్ స్పందన

వాషింగ్టన్: భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై తమ దేశంలో నమోదైన కేసుపై అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ స్పందించింది. ఈ సంక్షోభాన్ని ఇరు దేశాలు అధిగమించగలవని పేర్కొంది. ఈ కల్లోలం నుంచి బయటపడటానికి భారత్, అమెరికా మధ్య ఉన్న పటిష్ఠమైన సంబంధాలు సహయపడతాయని విశ్వాసం వ్యక్తం చేసింది. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియర్ మాట్లాడుతూ గౌతమ్ అదానీపై నమోదైన కేసుల గురించి బైడెన్ ప్రభుత్వానికి తెలుసని అన్నారు.

ఆస్ట్రేలియాలో అదానీ మైన్స్‌పై జాతివివక్ష ఫిర్యాదు

ఆస్ట్రేలియాలో అదానీ సంస్థపై జాతివివక్ష ఫిర్యాదు నమోదైంది. ఆ సంస్థకు చెందిన ఆస్ట్రేలియా బొగ్గు యూనిట్‌లో జాతి వివక్షను చూపుతున్నారంటూ ఆదివాసీ సంస్థ పౌర హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. అదానీ కార్మైకేల్ బొగ్గు గనిలో ఆదివాసీల సాంస్కృతిక ఆచారాలను నిర్వహించడానికి, సాంస్కృతి పరిజ్ఞానాన్ని పంచుకోవడాన్ని గని నిర్వాహకులు అడ్డుకుంటున్నారని ఆదివాసీ సంస్థ ఆరోపించింది.

NOTICE
BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL - I AT HYDERABAD
In S.A. NO.332 OF 2022
Between:
M.Hanumantha Reddy ...Applicant
AND
Bank of Maharashtra & 2 others ...Defendants
To
M/s. Aindhri Innovations Pvt. Ltd. (D2)
CIN No. u74999TG201PTC117237, having its Office at 4th Floor, Apurupa LNG, Tollywood Building, H.No. 8-2-293/82, Road No. 78, Film Nagar, Jubilee Hills, Hyderabad-500 096.
M.Laksmi Narayana Pradeep (D3)
Managing Director of M/s. Aindhri Innovations Pvt. Ltd., DIN.No. 03597971, Flat No. 202, 2nd Floor, JVS Hitex Pride, Hitex Road, Shilpa Layout, Green Hamlet, Kothaguda-500 084, Telangana.
As directed by the Hon'ble Debts Recovery Tribunal-I at Hyderabad the Defendants No. 2 & 3 are put on notice that the M.Hanumantha Reddy has filed Securitisation Application Numbered as SA No. 332 of 2022 before the Hon'ble Debts Recovery Tribunal-I at Hyderabad. In the said SA interim applications are also filed for Amendment, Stay and for Contempt of Court. The Hon'ble DRT has ordered for issue of notice to D2 & D3. The next date of hearing is on 04-12-2024. Hence this Notice.
G.ANAND KUMAR,
Advocate (Jubilee Hills)
(Counsel for Applicant)
Hyderabad, **9849471079.**

'పార్ట్ టైమ్' లేక.. అమెరికాలో ఆయాలుగా..

ఆర్థిక ఇబ్బందులు అధిగమించేందుకు అక్కడి భారత విద్యార్థుల ప్రయత్నం
అందులో తెలుగువారే అధికం

హైదరాబాద్, నవంబర్ 22: అమెరికాలో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు లభించడం చాలా కష్టంగా మారింది. దీంతో అక్కడి భారతీయ విద్యార్థులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిలో చాలా మంది విద్యార్థులు, ముఖ్యంగా తెలంగాణ, ఏపీకి చెందినవారు తమ ఆర్థిక అవసరాలను అధిగమించేందుకు అమెరికాలోని భారతీయ కుటుంబాల్లో ఆయాలు (బేబీ సిట్టర్లు)గా పని చేస్తున్నారు. అమెరికాలోని నిబంధనల ప్రకారం విద్యార్థులు క్యాంపస్‌లలో మాత్రమే పని చేయాలి. కానీ, అక్కడ రోజువారీ ఖర్చులు విపరీతంగా పెరగడంతో చాలా మంది విద్యార్థులు క్యాంపస్ వెలుపల అక్రమంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయాల్సి వస్తున్నది. ప్రస్తుతం అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు లభించడం కష్టంగా మారడంతో చాలా మంది భారతీయ విద్యార్థులు, ముఖ్యంగా యువతులు ఆయాలుగా పని చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. రోజుకు 8 గంటలపాటు ఆరేండ్ల బాలుడి సంరక్షణ బాధ్యతలను చూసుకుంటున్నానని, అందుకు గాను తనకు ఆ బాలుడి కుటుంబం గంటకు 13 డాలర్ల చొప్పున వేతనం చెల్లిస్తున్నదని, స్థానికంగా ఉన్న స్టోర్‌లోనో లేక పెట్రోల్ బంక్‌లోనో పని చేయడం కంటే ఈ ఉద్యోగమే బాగున్నదని ఓహియోలో చదువుతున్న ఓ హైదరాబాద్ విద్యార్థి తెలిపారు.



రాజ్యాంగ పీఠికపై తీర్పు వాయిదా

'ఎమర్జెన్సీ'లో పార్లమెంటు చేసినవన్నీ చెల్లవు అని చెప్పలేమన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 22: రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక అనే పదాలను చేర్చడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ పూర్తయ్యింది. మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామితో పాటు పలువురు వేసిన పిటిషన్లను సీజేఐ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం విచారించి, తీర్పును నవంబర్ 25కు వాయిదా వేసింది. ఎమర్జెన్సీలో పార్లమెంట్‌లో చేసినవన్నీ తప్పులని చెప్పలేమని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు 368వ అధికరణ కట్టబెట్టిందని, పీఠిక కూడా రాజ్యాంగంలో భాగమేనని కోర్టు పేర్కొన్నది.

తప్పుడు ధ్రువ పత్రాలతో కెనడాలో అడ్మిషన్లు

- 10 వేల మంది విదేశీ విద్యార్థుల గుర్తింపు
- అందులో 80 శాతం భారతీయులే

టొరంటో, నవంబర్ 22: తప్పుడు ధ్రువ పత్రాలతో మోసపూరితంగా తమ దేశంలో విద్యను అభ్యసించడానికి వచ్చిన 10 వేల మంది విదేశీ విద్యార్థులను కెనడా ప్రభుత్వం గుర్తించింది. వీరు మోసపూరిత విద్యార్థి అంగీకార లేఖలు సమర్పించి తమ దేశంలోని విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందారని ఇమ్మిగ్రేషన్ రిఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) పేర్కొన్నట్టు కెనడా డైలీ గ్లోబ్ అండ్ మెయిల్ తెలిపింది. ఆ దేశంలో అమలులో ఉన్న కఠిన నిబంధనల మేరకు 2024లో 5 లక్షల మంది విదేశీ విద్యార్థులు సమర్పించిన దరఖాస్తులు, పత్రాలను పరిశీలించారు. ఇందులో 10 వేల మంది విద్యార్థులు నకిలీ ధ్రువపత్రాలతో తమ దేశానికి వచ్చినట్టు గుర్తించారు. వీరిలో 80 శాతం మంది భారత్‌లోని గుజరాత్, పంజాబ్‌లకు చెందిన వారే. భారత్‌లో లైసెన్స్ లేని కన్సల్టెన్సీలు, విద్యా సంస్థల ద్వారా జారీ చేసిన లేఖల ద్వారా కొంతమంది భారత విద్యార్థులు అడ్మిషన్లు పొందిన విషయం 2023లోనే బయటపడింది. అప్పట్లో వారు దేశ బహిష్కరణ భయాన్ని కూడా ఎదుర్కొన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల దరఖాస్తుల పరిశీలన కఠినతరం చేయడంతో ఈ ఏడాది 10 వేల మంది అక్రమ పత్రాల ద్వారా ప్రవేశం పొందినట్టు గుర్తించారు. ఇలా నకిలీ ధ్రువ పత్రాలతో అడ్మిషన్లు పొందడం పట్ల అక్కడి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక్క రాష్ట్రంలోనైనా బీజేపీ ఉచితాన్ని అమలు చేసిందా?

ఉచితాలపై చర్చలో కేజ్రీవాల్ సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న 20 రాష్ర్టాల్లో ఒక్కదానిలోనైనా తాము ప్రవేశపెట్టిన ఉచిత పథకాన్ని అమలు చేసిందా ? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ప్రజలకు బీజేపీ చేసిందేమీ లేదని, తాము చేసిన పనులను అడ్డుకోవడానికే ఆ పార్టీ ఉందని ఆయన ఆరోపించారు. ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం 'ఉచితాలపై చర్చ' ప్రచారాన్ని ప్రారంభించారు. ఉచితాల గురించి పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు వివరిస్తారని చెప్పారు. 10 ఏండ్లుగా ఢిల్లీకి బీజేపీ ఏం చేసిందో ఈ సభల్లో తమ నేతలు ప్రశ్నిస్తారని కేజ్రీవాల్ తెలిపారు. కాగా, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా వ్యంగ్యోక్తిగా పొగడ్తలు కురిపించారు. 'కేజ్రీవాల్ కన్నా ఆమె వెయ్యి రెట్లు నయం' అని అన్నారు.

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500 068,
ఫోన్ నెం.లు 040-29803086/3186, ఇ-మెయిల్: ol.hyderabad@mca.gov.in
గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో: హైదరాబాద్ వద్ద
(ప్రారంభ అధికారపరిధి)
కంపెనీ పిటిషన్ నెం. 174 ఆఫ్ 2001లో
కంపెనీ అప్లికేషన్ నెం. 30 ఆఫ్ 2022లో I.A.No.1 ఆఫ్ 2024
కంపెనీల చట్టం, 1956 విషయంలో
మరియు
మెసర్స్ శక్తి సాయి ఫ్లవర్స్ & టిష్యూస్ పబ్లిక్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
దిగువ తెలిపిన వారి మధ్య:
మెసర్స్ శక్తి సాయి ఫ్లవర్స్ & టిష్యూస్ పబ్లిక్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు). ప్రాతినిధ్యం వహిస్తున్నవారు అఫీషియల్ లిక్విడేటర్, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, హైదరాబాద్ కొరకు. ...**దరఖాస్తుదారు**
మరియు
1. శ్రీ చాకలి కర్రోల సాంబయ్య, తండ్రి: బాలయ్య, దుద్దెడ గ్రామం, కొండపాక మండలం, సిద్దిపేట జిల్లా మరియు 28 మంది ఇతరులు. ...**ప్రతివాదులు**
దిగువ తెలిపిన వారికి,
శ్రీ పెద్దంకుల రామస్వామి, తండ్రి: మల్లయ్య, ఇం.నెం. 4-46, దుద్దెడ గ్రామం, కొండపాక మండలం, సిద్దిపేట జిల్లా, డాక్యుమెంట్ నెం. 6389/2008, తేది: 15-11-2008. **C.A.No. 30/2022లో ప్రతివాది నెం. 5.**
శ్రీ జె.పూర్ణచందర్‌రావు, తండ్రి: రఘుపతిరావు, బి-6, ఎఫ్-34, రామరాజ నగర్, జీడిమెట్ల, హైదరాబాద్-500 055, డాక్యుమెంట్ నెం. 6406/2008, తేది: 15-11-2008. **C.A.No.30/2022లో ప్రతివాది నెం.6.**
మెసర్స్ ఎ.ఎస్. లీజింగ్ & ఫైనాన్స్ లిమిటెడ్, M.D.గా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సునీల్ కుమార్ అహుజ, తండ్రి: స్వర్గీయ శ్రీ కె.ఎన్.అహుజ, పెంట్‌హౌస్, సురభి అపార్ట్‌మెంట్స్, 1-1-563/564, న్యూ బాకారం, గాంధీనగర్, హైదరాబాద్-500 080, డాక్యుమెంట్ నెం. 1627/2012, తేది: 24-02-2012. **C.A.No.30/2022లో ప్రతివాది నెం. 10.**
శ్రీమతి కొట్టె వినోద అలియాస్ రెడ్డి వినోద, తండ్రి: కొట్టె బాల్‌రెడ్డి, H/o. రెడ్డి లక్ష్మా రెడ్డి, ఇం.నెం. 3-4-45/1/8, సాజిద్‌పుర, సిద్దిపేట్, సిద్దిపేట్ జిల్లా. డాక్యుమెంట్ నెం.9248/2016, తేది: 27.9.2016. **C.A.No. 30/2022లో ప్రతివాది నెం. 16.**
నోటీస్
లిక్విడేషన్‌లోని కంపెనీకి చెందిన, సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం, దుద్దెడ గ్రామంలో అఫిడవిట్ పేరా 13లో టేబుల్‌లో తెలిపిన విధంగా, ఎక. 29.04 గుంటల విస్తీర్ణపు భూమికి సంబంధించి జరిగిన అక్రమ బదిలీలు మరియు CA No.1053/2009లో ఇవ్వబడిన 13-07-2011 తేదీనాటి ఈ గౌరవనీయ న్యాయస్థానపు ఉత్తర్వుల తర్వాత అక్రమంగా రిజిస్టర్ అయిన సేల్‌డీడ్స్ మరియు ముఖ్యంగా ప్రతివాదులు 1 నుండి 19 వారి పేరున రిజిస్టర్ అయిన సేల్ డీడ్స్‌ను రద్దు చేయవలసిందిగా మరియు అక్రమ కొనుగోలుదారుల పేరున రిజిస్టర్ అయిన సేల్‌డీడ్స్ రద్దు చేయుట ద్వారా ధరణి పోర్టల్‌లో అవసరమైన మార్పులు చేయవలసిందిగా ప్రతివాదులు నెం. 20 నుండి 22 వారిని ఆదేశించుటకు ఉత్తర్వు నిమిత్తం కంపెనీలు (కోర్ట్) రూల్స్, 1959లోని రూల్ 9తో చదువబడు కంపెనీల చట్టం 1956లోని సెక్షన్ 441, 446(1), 456, 457, 536 మరియు 537(1)(బి) క్రింద గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ సమక్షంలో IA No. 1/2024తో సహా C.P.No. 174/2001లో కంపెనీ అప్లికేషన్ నెం. 30/2022ను అఫీషియల్ లిక్విడేటర్ దాఖలు చేశారని తెలియజేయడమైనది.
సదరు విషయం గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్‌లో కంపెనీల వ్యవహారాలపై గౌరవనీయ జడ్జి సమక్షంలో విచారణ నిమిత్తం **02-12-2024న ఉ॥ 10.30 గం.కు** వాయిదా వేయబడినది. పైన తెలిపిన ప్రతివాది నెం.లు. 5, 6, 10 మరియు 16 వారు సదరు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం సమక్షంలో స్వయంగా లేదా అడ్వకేట్ ద్వారా హాజరు కావల్సిందిగా తెలియజేయడమైనది. పైన తెలిపిన సదరు తేదీన హాజరు కావడంలో మీరు విఫలమైతే సదరు విషయం మీ పరోక్షంలో విచారణ జరిపి నిర్ణయించబడును.
(గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వు ద్వారా)
సం/-
తేది: 21-11-2024, (U.K.సాహూ, ICLS)
ప్రదేశం: హైదరాబాద్. **అఫీషియల్ లిక్విడేటర్,**
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్.

ఇది ప్రపంచ యుద్ధం!

- పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌ను రెచ్చగొడుతున్నాయి
- వారికి ఆయుధాలిస్తున్న దేశాలపై దాడికి వెనుకాడం
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రపంచ యుద్ధ స్వభావాన్ని సంతరించుకుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. పాశ్చాత్య దేశాల వల్లే ఈ యుద్ధం తీవ్రతరమవుతున్నదని ఆరోపించారు. ఈ ఘర్షణ మరింత ఉధృతమైతే, ప్రతీకార చర్యలు చేపట్టే హక్కు రష్యాకు ఉందన్నారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇచ్చి, ఘర్షణను ఎగదోస్తున్న దేశాల్లోని సైనిక స్థావరాలపై దాడులకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ప్రస్తుత ఉద్రిక్తతలకు కారణం అమెరికాయేనని పుతిన్ పునరుద్ఘాటించారు.

బల ప్రయోగం ద్వారానే శాంతి

ఇదిలావుండగా, రష్యా కొత్త బ్యాలిస్టిక్ మిసైల్‌ను మోహరించిన నేపథ్యంలో, శుక్రవారం జరగవలసిన ఉక్రెయిన్ పార్లమెంటు సెషన్ రద్దయింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కార్యాలయం స్టాండర్డ్ సెక్యూరిటీ మెజర్స్ ప్రకారం కార్యకలాపాలను కొనసాగిస్తున్నది. తన కొత్త ప్రయోగాత్మక హైపర్‌సోనిక్ క్షిపణిని ఉక్రెయిన్‌పై ప్రయోగించినందుకు రష్యాపై చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాల నేతలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరారు. నిజమైన శాంతి కోసం రష్యాను ప్రపంచ దేశాలు కోరాలని, బలప్రయోగం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందని అన్నారు.

మూడో ప్రపంచ యుద్ధం మొదలైంది

2024లో మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభమైందని ఉక్రెయిన్ మాజీ మిలిటరీ కమాండర్-ఇన్-చీఫ్ వలెరీ జలుజ్నీ చెప్పారు. ఉక్రెయిన్స్కయూపీ100 అవార్డ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యుద్ధంలో రష్యా నియంతృత్వ మిత్రులు పాల్గొంటున్నందువల్ల, ఇది అంతర్జాతీయ స్థాయికి విస్తరించిందని చెప్పవచ్చునన్నారు. ఉత్తర కొరియా సైన్యం ఉక్రెయిన్ ముందు నిల్చుందని, ఇరానియన్ 'షాహెదీస్' బాహాటంగానే ఉక్రెయిన్ ప్రజలను చంపుతున్నారని తెలిపారు. చైనా ఆయుధాలు యుద్ధంలో కనిపిస్తున్నాయని చెప్పారు.

ట్రాన్స్‌స్క్రిప్ట్‌గా వాయిస్ మెసేజ్

వాట్సాప్‌లో త్వరలో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో వాయిస్ మెసేజ్‌ను టెక్ట్స్‌గా మార్చుకునే ట్రాన్స్‌స్క్రిప్ట్ ఫీచర్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు మెటా సంస్థ గురువారం ప్రకటించింది. వినియోగదారులు సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఈ ఆప్షన్‌ను ఎనబుల్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఒకసారి ఎనబుల్ చేసిన తర్వాత ప్రతి వాయిస్ మెసేజ్ ఆటోమెటిక్‌గా టెక్ట్స్ రూపంలోకి మారిపోతుంది. ఈ టెక్ట్స్ కేవలం మెసేజ్‌ను అందుకున్న యూజర్ మాత్రమే చూడగలరని, ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్ సహా పలు భాషల్లో వాయిస్ మెసేజ్‌ను టెక్ట్స్‌గా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. అయితే, ట్రాన్స్‌స్క్రిప్ట్‌లను ఎక్కడ స్టోర్ చేస్తుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు

మహా సీఎం పీఠం కోసం పోరు మొదలు

ముంబై, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ శనివారం జరగనుంది. రెండు రాష్ర్టాల్లోనూ హోరాహోరీ పోరు జరగడం, ఎగ్జిట్ పోల్స్‌లోనూ గెలుపెవరిదో నిర్దిష్టంగా తేలకపోవడంతో కౌంటింగ్‌పై ఉత్కంఠ నెలకొన్నది. రెండు రాష్ర్టాల ఫలితాల ప్రభావం వచ్చే ఏడాది జరగనున్న ఢిల్లీ, బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై పడే అవకాశం ఉండటంతో జాతీయ స్థాయిలోనూ ఫలితాలపై ఆసక్తి నెలకొన్నది. ఎన్నికల ఫలితాలు రాక ముందే ముఖ్యమంత్రి పీఠంపై పేచీ మొదలైంది. ఎన్నికల్లో మహాయుతి గెలుస్తుందని, అజిత్ పవార్ కాబోయే సీఎం అంటూ ఆయన పోటీ చేసిన బారామతి నియోజకవర్గంలో పోస్టర్లు వెలిశాయి. ఏక్‌నాథ్ షిండే మరోసారి సీఎం అవుతారని శివసేన నమ్మకంగా ఉంది. మరో వైపు మహావికాస్ అఘాడీ(ఎంవీఏ)లోనూ సీఎం పదవిపై పోరు మొదలైంది. కాంగ్రెస్ నేత పటోలే ప్రకటనతో శివసేన(ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ విభేదించారు.

హిందువుల రక్షణపై చేతులెత్తేసిన కెనడా!

లైఫ్ సర్టిఫికెట్ క్యాంపులకు భద్రత కల్పించలేమన్న పోలీసులు

ఓక్‌విల్లే: కెనడా పోలీసులు ఖలిస్థానీ సిక్కు సంస్థల ఒత్తిళ్లకు తల వంచారు. ఆ దేశంలోని మైనారిటీలైన హిందువులకు భద్రత కల్పించలేమని నిస్సిగ్గుగా ప్రకటించారు. భారతీయ దౌత్యవేత్తలు ఈ నెల 23న ఓక్‌విల్లేలోని వైష్ణోదేవి దేవాలయంలో, ఈ నెల 30న స్కాబరోలోని లక్ష్మీ నారాయణ మందిరంలో లైఫ్ సర్టిఫికెట్ క్యాంపులను నిర్వహించవలసి ఉంది. అయితే, ఈ దేవాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని సిక్స్ ఫర్ జస్టిస్ ప్రకటించింది. దీంతో పోలీసులు వైష్ణో దేవి దేవాలయం ధర్మకర్తలపై ఒత్తిడి తేవడంతో కార్యక్రమాన్ని రద్దు చేశారు.

'నిజ్జర్ హత్యలో మోదీ పాత్ర'పై వెనక్కు తగ్గిన కెనడా

ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో ప్రధాని మోదీ, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్, మంత్రి జైశంకర్ ప్రమేయం ఉన్నట్లు కెనడా మీడియాలో వచ్చిన కథనాలపై కెనడా స్పందించింది. వారి ప్రమేయం ఉన్నట్లు తమ ప్రభుత్వం ఎన్నడూ చెప్పలేదని తెలిపింది.

రైల్లో ప్రయాణికులతో లూడో ఆడుతూ దొంగతనాలు

బీహార్ యువకుడ్ని పట్టుకున్న పోలీసులు

న్యూఢిల్లీ: రైల్లో ప్రయాణికులతో మాటలు కలిపి, వాళ్లతో స్నేహంగా ఉంటూనే దొంగతనాలకు పాల్పడుతున్నాడు ఓ బీహార్ యువకుడు. రైలు ప్రయాణికులతో లూడో గేమ్ ఆడుతూ..వారి మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్ తెలుసుకోవటం, ఆ తర్వాత నిద్రమాత్రలు ఇచ్చి వారి సర్వం దోచుకోవటం ఇతడి స్టైల్! ఉత్తరప్రదేశ్‌లో ఘజియాబాద్ జీఆర్‌పీ పోలీసులు అతడ్ని పట్టుకున్నారు. నిందితుడు బీహార్‌లోని దర్భాంగకు చెందిన సాగిర్‌గా పోలీసుల విచారణలో తేలింది. అతడి వద్ద 8 ఫోన్లు, రెండు ఆధార్ కార్డులు, నిద్ర గోలీలు, ఓ బ్యాగు, 67,150 నగదు లభ్యమయ్యాయి. బీహార్‌కు వెళ్లే వైశాలీ ఎక్స్‌ప్రెస్, సంపూర్ణ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ప్రయాణికులను సాగిర్ టార్గెట్ చేస్తుంటాడు. స్లీపర్, జనరల్ బోగీల్లోని ప్రయాణికులతో మాటలు కలిపి, వారికి నిద్ర మాత్రలు ఇచ్చి..వారి వద్ద ఉన్న నగదు, ఏటీఎం కార్డులు, ఫోన్లు, విలువైన వస్తువులు దొంగలించేవాడని పోలీసులు చెప్పారు.